# మందారం

తొలివేకువ స్పర్శతో కళ్ళు విప్పింది ప్రకృతి. ఉలిక్కిపడి లేచింది సుచరిత. సగం మగతలోనే గుమ్మందాకా నడిచి తలుపు తీసింది. ఎదురుగా శంకరాన్ని చూచి నిద్ర ఎగిరిపోయింది. ఇంత అకస్మాత్తుగా శంకరం రావడానికి గల కారణాన్ని ఊహిస్తూంది. అమ్మ లెటర్ రాసుంటుంది. చెల్లిలి సమస్యను పరిష్కరించడానికి అన్నగారు పరిగెత్తుకుని వచ్చుంటాడు.

"ఏమ్మా నన్ను లోపలికి రానివ్వవా ఏమిటి?" పరిహాసంగా నవ్వాడు శంకరం.

"అబ్బే.. నా.. నా... అదేంలేదు మామయ్యా..." తడబడుతూ పక్కకి తప్పుకుని శంకరానికి దారిచ్చింది సుచరిత.

"అన్నయ్యా..." సంభ్రమంగా అన్నగారి వంక చూస్తూ అతని చేతిలో బాగ్ అందుకుంది శాంత.

టూత్‌పౌడర్ చేతిలో వేసుకుని పెరట్లోకి వెళ్ళింది సుచరిత. తనమీద దాడికి మరోవ్యక్తి వచ్చాడు. ఉన్నవాళ్ళను ఎదుర్కోవడానికే శక్తి చాలడం లేదు. ముఖ్యంగా అమ్మ చాదస్తాన్ని, అమాయకత్వాన్ని, మొండి పట్టుదలను భరించలేకపోతోంది. ఎంతసేపూ కలల్లోనూ, భ్రమల్లోనూ బ్రతుకుతారు తప్పితే కళ్ళెదుట వున్న వాస్తవాలని ఎందుకు గుర్తించరు వీళ్ళు?

సుచరిత ఆలోచనలో వుండగానే ఆమె ముగ్గురు చెల్లెళ్ళు, తమ్ముడు లేచి పెరట్లోకి వచ్చారు.

"అక్కా! అమ్మ మామయ్యతో నీ విషయమంతా చెప్పి ఏడుస్తూంది. నిన్ను నాలుగు కేకలేసి దార్లో పెట్టమని బ్రతిమాలుతూంది." సుచరిత పెద్ద చెల్లెలు సుహాసిని అక్క చెవిలో రహస్యంగా చెప్పింది.

సుచరిత గుండె మండిపోయింది. తనేదో నేరం చేసినట్టు యీ ఏడుపులూ, మొత్తుకోళ్ళూ ఏమిటి? ఈ ఫిర్యాదులూ విచారణలూ ఏవిటి? అసలు తనంత కాని పనేంచేసిందని?

"అక్కా! అమ్మ కాఫీ పెట్టమంటూంది" తమ్ముడొచ్చి చెప్పాడు. స్టౌ వెలిగించి కాఫీ పెడుతూ ఆలోచిస్తూంది సుచరిత. మామయ్య తెలివిగలవాడు. నేర్పుగా తనని ఒప్పించడానికి ప్రయత్నిస్తాడు. ఒడుపుగా తప్పించుకోవడానికి ప్రయత్నించాలి తను.

సుచరిత అసహనంగా ఎదురు చూస్తున్న సమయం రానే వచ్చింది. మళ్ళీ సాయంత్రం వెళ్ళిపోవలసిన శంకరం భోజనాలవగానే సుచరితను పిలిచాడు. అప్పటికే పిల్లల్నందరినీ ఏదో ఒక నెపంమీద బయటికి పంపించింది శాంత. సుచరిత తండ్రి మూర్తి  శంకరం ప్రక్కన మౌనంగా కూర్చున్నాడు. సుచరిత తలవంచి ఆలోచిస్తూ శంకరం అడగబోయే ప్రశ్నలకు జవాబివ్వడానికి సంసిద్ధమవుతూంది. ధైర్యంగా జవాబివ్వాలను కుంటున్న సుచరితను అంతలోనే

నిస్పృహ ఆవరించింది. తన బ్రతుకులో ఏ సంఘటనా సాఫీగా ఏ గోలా లేకుండా జరగనే జరగదా? గోల! యుద్ధం!! సత్యాగ్రహం!!! సుచరిత హైస్కూలు చదువు ముగించి కాలేజిలో ఇంటర్మీడియట్ చదువుదామనుకున్నప్పుడు ఇంత గోలా జరిగింది. ఐదుగురు పిల్లలతో, నెలలో సగం రోజులు గడిచేసరికే ప్రతి చిన్న దానికి తడుముకోవలసి వస్తున్న పరిస్థితిలో తను కాలేజీ చదువులకు తూగలేనని చెప్పాడు మూర్తి. ఆడపిల్లలకు చదువు, ఉద్యోగాలు అంటే సదభిప్రాయం లేని శాంత సుచరిత చదువు గురించి కంటే ఆమె పెళ్ళి గురించి ఎక్కువ ఆసక్తి కనబరిచింది.

“నేను చదువుకుంటాను నాన్నగారూ! నాకిప్పుడే పెళ్ళేమిటి? అమ్మకి మీరు నచ్చచెప్పండి.” తల్లి లేకుండా చూచి తండ్రితో అంది సుచరిత.

“నువ్వు చదువుకుని వృద్ధిలోకి వస్తే నాకూ సంతోషమేనమ్మా! కానీ... ఖర్చు...” నిస్సహాయంగా కూతురి వంక చూచాడు మూర్తి.

“ఎలాగోలా ఫీజులు కట్టండి చాలు. మరింక దేనికీ మిమ్మల్ని శ్రమ పెట్టను.” ఆడపిల్లకు చదువూ, స్వంత సంపాదన ఎంత ముఖ్యమో గుర్తించిన సుచరిత తను తప్పక కాలేజీలో చేరాలనే పట్టుదలతో ఉంది.

“నాన్నగారూ! ప్లీజ్!” తన అసమర్థతకు సిగ్గుపడుతూ ముఖం తిప్పుకున్న తండ్రి చుబుకాన్నెత్తుతూ గారంగా చూచింది సుచరిత.

కూతురి మాటలకు మెత్తబడిన మూర్తిని దులిపేసింది శాంత.

“దానికి తెలివి లేకపోతే మీ ఇంగితమేమయిందండీ? కాలేజీ చదువులంటే మాటలా? ఎక్కడ్నుంచి తెస్తారు డబ్బు? ఓపలేని బరువులు తలకెత్తుకోవడ మెందుకో?”

“ఐతే ఏమిటమ్మా నువ్వనేది?” రెచ్చిపోతూ అడిగింది సుచరిత.

“నోరు మూసుకుని యింట్లో కూర్చోమంటున్నాను. లక్షణంగా పెళ్ళి చేసుకుని కాపరానికి వెళ్ళ మంటున్నాను” అంది శాంత

“అంతేకాని నన్ను చదువుకోనివ్వవన్న మాట! నా కాళ్ళ మీద నేను నిలబడడం నీకిష్టం లేదన్నమాట! ఇరవై ఏళ్ళకే పురుళ్ళతో... పిల్లలతో... ఎదుగుబొదుగూలేని బ్రతుకులో కూరుకుపోతేగాని నువ్వు శాంతించవన్న మాట!” రుద్ధ కంఠంతో ఉక్రోషంగా అడిగింది సుచరిత.

"ఎదుగూబొదుగూలేని బ్రతుకేం ఖర్మే?! దర్జాగా ఓ డాక్టర్నో, ఇంజనీర్నో పేద్ద ఆఫీసర్నో చేసుకుంటావు" దర్పంగా అంది శాంత. కూతురి అందాన్ని చూచి ఏ రాకుమారుడో వరిస్తాడని కలలు కంటున్న తల్లి మూర్ఖత్వాన్ని సహించ లేకపోయింది సుచరిత.

"ఎలా? ఏమైనా ఖజానా వుందా? లంకెల బిందెలేమయినా దొరికాయా? ఎలా కొంటావు నువ్వు చెప్పిన గొప్పవాళ్ళను" వెటకారంగా అడిగింది సుచరిత.

నిర్వికారంగా తల్లీ కూతుళ్ళ వాదనను వింటున్నాడు మూర్తి.

"చూడండి..చూడండి.. పెద్దంతరం చిన్నంతరం లేకుండా దీని వాగుడు చూడండి... ఏమిటండీ, అలా గుళ్ళో విగ్రహంలా కూర్చుంటారు? దానిక్కాస్త బుద్ధి చెప్పలేరూ?"రయ్యిమని లేచింది శాంత.

"అమ్మా! నేను చచ్చినా ఇప్పుడు పెళ్ళి చేసుకోను. నాన్నగారు ఫీజులు కట్టకపోతే నలుగుర్నీ చందాలడుక్కునైనా సరే కాలేజీలో చేరతాను. నేను చదువుకుని, ఉద్యోగం సంపాదించుకున్నాక గాని పెళ్ళి ప్రసక్తి ఎత్తే పనే లేదు" మొండిగా అని అక్కడి నుంచి లేచి వెళ్ళి పోయింది సుచరిత.

యుద్ధం చేసి నాలుగురోజులు తిండి మానేసాక గాని సుచరిత కాలేజీలో చేరడానికి ఒప్పుకోలేదు యింట్లో వాళ్ళు. ప్రపంచాన్నే జయించినంత ఆనందంతో, ఉత్సాహంతో కాలేజీకి వెళ్ళ సాగిందామె.

కానీ కాలేజీ చదువుల పట్ల సుచరితకి వున్న ఉత్సాహం జారిపోవడానికెంతో కాలం పట్టలేదు. కాలేజీ వాతావరణం చాలా విచిత్రంగా వుంది. చదువు చెప్పే వాళ్ళకు, చెప్పించుకునే వాళ్ళకు చదువు మీద ఎలాంటి ఆసక్తీ లేదు. ఉపాధ్యాయులకీ, విద్యార్థులకీ మధ్య ఏ విధమైన ఆప్యాయతా లేదు. కొన్నాళ్ళు విద్యార్థుల స్ట్రయిక్, కొన్నాళ్ళు ఉపాధ్యాయుల స్ట్రయిక్... మొత్తం మీద సగం రోజులు కాలేజీ నడవలేదు. అసలెవరైనా ఎందుకు స్ట్రయిక్ చేయాల్సి వచ్చిందో... ఎవరు ఎందుకు స్ట్రయిక్ చేసినా దాని దుష్ఫలితాల్ని మాత్రం తమలాంటి పేద విద్యార్థులెందుకు అనుభవించాల్సి వస్తుందో సుచరితకు అర్థం కాలేదు. తన క్లాసులో ఏమాత్రం డబ్బువున్న విద్యార్థయినాసరే ప్రతి సబ్జక్ట్‌కి ప్రైవేట్ చదువుతున్నాడు. వాళ్ళకు కావలిసింది కాలేజీ అటెండెన్స్ తప్పితే కాలేజీలో లెక్చరర్స్ చెప్పే చదువు కాదు. యీ పరిస్థితిలో తనలాంటి విద్యార్థుల గతి అధోగతేనని తెలుసుకున్న సుచరిత దిక్కుతోచక నిలబడి చూస్తుండగానే మొదటి సంవత్సరం గడిచి పోయింది.

తన లక్ష్యం గుర్తుకొచ్చిన సుచరిత తనను తాను సంబాళించుకొని, చదువునొక తపస్సులా భావించి, అహోరాత్రులు కష్టించి చదివింది. ఆమె మనోనేత్రాల ముందెప్పుడూ ఓవర్ కోటూ, స్టెతస్కోపు కదలాడుతుండేవి. మరే విషయం మీదా అసక్తి, అనురక్తీ లేకుండా... ఒక్క సినిమా, షికారు లేకుండా చదివి ఫైనల్ పేపర్లు వ్రాసింది సుచరిత.

మరో మూడు నెలల్లో మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షలు. చాలా మంది గుంటూరులో ఓ ప్రసిద్ధి వహించిన ట్యుటోరియల్ కాలేజీలో కోచింగ్ కోసం వెళ్లారు. కొంతమంది స్థానికంగా వున్న ట్యుటోరియల్ కాలేజీల్లో చేరారు. ఇంక ట్యూషన్స్ సరే. సుచరితకు ఎంట్రెన్స్ పరీక్షల పద్ధతిలో చదవడమెలాగో తెలియడంలేదు. ట్యూషన్ చదవడం తప్ప మరో గత్యంతరం కనపడడంలేదు. ఏమైనా సరే ట్యూషన్ గురించి తండ్రిని ఒప్పించాలని నిశ్చయించుకుంది.

ఒకప్పుడు చందాలు పోగుచేసుకునైనా సరే చదువుకుంటానని బింకంగా తల్లికి చెప్పిన సుచరిత ఒకరి దగ్గర చెయ్యి చాచడానికి తనను తానెంతగా చంపుకోవాలో గుర్తించింది. అది తన వల్ల కాదని కూడా గ్రహించింది. అందుకే కష్టమైనా ఈ భారాన్ని తండ్రి భుజాల మీద మోపడానికే నిర్ణయించుకుంది.

"ఏమిటమ్మా?" తనచుట్టూ తచ్చిళ్లాడుతూ అస్థిమితంగా తిరుగుతున్న కూతురు తనకేదో చెప్పాలని ప్రయత్నిస్తూందని గ్రహించాడు మూర్తి. ఉలిక్కిపడి తలెత్తిన సుచరిత అధిక శ్రమతో, అలసటతో వాడిపోయిన తండ్రిముఖం చూడగానే తను అడగాలనుకున్నది అడగలేకపోయింది.

"అబ్బే! ఏంలేదు నాన్నగారూ!" తండ్రి చూపుల్ని తప్పించుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

ఏం చేయాలో తోచక సతమతమవుతూ భయపడుతూ భయపడుతూనే జూవాలజీ, కెమిస్ట్రీ కోచింగ్ యిస్తున్న లెక్చరర్స్ దగ్గరకు వెళ్ళి తన ఆర్థిక పరిస్థితి చెప్పుకుని తన సందేహాలను తీర్చమని అర్థించింది. వాళ్ళు అందుకు సులభంగా ఒప్పుకోవడంతో పొంగిపోయింది. ఇంక తనకు మెడిసిన్‌లో సీట్ రావడం ఖాయం అన్న ఆత్మవిశ్వాసంతో, ద్విగుణీకృతోత్సాహంతో పరీక్షకు చదవడం మొదలు పెట్టింది.

***

ఇంటర్ రిజల్ట్స్ వచ్చాయి. ట్యూషన్స్ లేకపోయినా క్లాసులో ఎప్పుడూ మొదటి నాలుగు రేంక్స్‌లో వుండే సుచరిత తన నెంబర్ ఫస్ట్‌క్లాస్‌లో లేకపోయేసరికి షాక్ తింది. చలనం లేకుండా కూర్చున్న అక్క చేతిలోంచి పేపర్ తీసుకుని నంబర్ కోసం వెదికింది సుహాసిని. సెకండ్ క్లాస్ వచ్చిందని అక్కతో అనడానికి భయ పడిందామె.

ఇంటర్ రిజల్ట్ సుచరిత మీద పెద్ద దెబ్బ తీసింది. ముందు ఎంత ఆలోచించినా తనకెందుకంత తక్కువ మార్కులు వచ్చాయో... తనతో పోల్చడానికే వీల్లేని వాళ్లకి కొంతమందికి తనకంటే ఎక్కువ మార్కులెలావచ్చాయో అర్థం కాలేదు. అందరూ చెప్పుకుంటున్న మాటల్ని బట్టి, పేపర్లో వచ్చిన వార్తల్ని బట్టి తనలాంటి వాళ్లెంతో మందికి ఎలా అన్యాయం జరిగిందో తెలిసింది.

మార్కులు చూస్తున్న కొద్దీ తను పడిన శ్రమను తలచుకుంటే దుఃఖం ముంచుకొస్తోంది. ఎవరికి చెప్పుకోవాలి తనకు జరిగిన అన్యాయాన్ని? ఎవరు వింటారు తన మొరను? ఎవరు తనకు జరిగిన ఘోరమైన అన్యాయాన్ని సరిదిద్దగలరు? ఎవరు కూలిపోయిన తన ఆశల శిఖరాన్ని నిలబెట్టేది?

మతి చలించిన దానిలా కనపడినవాళ్ళనల్లా అడిగింది. తెలిసిన వాళ్ళని, లెక్చరర్స్‌ని, ప్రిన్సిపాల్‌ని... అందర్నీ అడిగింది. తనకు న్యాయం లభించే దారి చూపించమని... తను ప్రాధేయపడిన వారెవరూ తనకు ఏవిధమైన సహాయం చెయ్యలేరని, తన తండ్రి చేతిలో డబ్బుంటే తనే కొంచెం ప్రయత్నమైనా చెయ్యగలదని తెలిసి హతాశురాలయింది సుచరిత.

ఆలోచించిన కొద్దీ ఆవేశం, ఉద్రేకం పొంగివస్తున్నాయి. యిలా అన్యాయానికి గురయింది తనొక్కతే కాదు. తనంత, తనకంటే ఎక్కువగా దెబ్బతిన్న వాళ్ళు లెఖ్ఖలేనంత మందిఉన్నట్లు తను రోజూ పేపర్లలో చూస్తూనే వుంది. వీళ్ళంతా సంఘటితమయి తమకు జరిగిన అన్యాయాన్ని ప్రతిఘటించలేదెందుకని? ప్రతి చిన్న విషయాన్ని గోరంతది కొండంత చేసి స్ట్రయికులు చేసే విద్యార్థులు తమ భవిష్యత్తుకు గొడ్డలి పెట్టుపెడుతున్న యీ అవకతవకల్ని ఎందుకు సహిస్తున్నారు? అల్లర్లలో, విధ్వంసక చర్యలలో అమోఘమైన ఐకమత్యాన్ని ప్రదర్శించే విద్యార్థులు తమకు జరిగిన అన్యాయానికి కారకులైన వార్ని గట్టిగా నిలదీసి ప్రశ్నించరెందుకని? తమ స్వార్థ ప్రయోజనాల కోసం విద్యార్థుల్ని పావులుగా వాడుకునే ప్రజానాయకులు యిలాంటి విషమ సమయంలో వాళ్ల ప్రక్కన నిలబడి పరిస్థితినెందుకు సరిచేయడంలేదు? యింతటి దారుణాన్ని మౌనంగా సహించి

పూరుకుంటున్నందుకు, ఎలాంటి ప్రతిఘటన లేకుండా నిర్వీర్యంగా వుండి పోయినందుకు మొత్తం విద్యార్థి లోకమంతా సిగ్గుతో చితికి పోవాలి... ఆలోచనలు, ఆలోచనలు, కట్టలు తెగుతున్న ఆవేశం... ఆవేశం చల్లారాక వచ్చే నిస్సత్తువ... ఇవే మిగిలాయి సుచరితకు. ఆమె ఆలోచనలు, ప్రశ్నలు విని పిచ్చిదాన్ని చూచినట్లు చూచి నవ్వారు. ఈ ఘనమైన ప్రజాస్వామ్య దేశంలో బ్రతుకుతూ చదువుకూడా వెలగబెడుతున్న వ్యక్తి సామాన్యుడి న్యాయం గురించి యింత అమాయకపు ప్రశ్నలు వేస్తున్నందుకు జాలి పడ్డారు.

“నయం... ఇంకా నువ్వు అదృష్ట వంతురాలివి కదూ! ఎన్నో కొన్ని మార్కులంటూ వచ్చాయి నీకు. అసలు పాసయ్యావు. అదెంతకాదు? అసలు మార్కుల లిస్టులే గల్లంతయిన వాళ్ళు, ఫెయిలయిన వాళ్ళు ఎంతమందో? అన్ని కోర్సులకీ అప్లికేషన్స్ పెట్టడానికి గడువు దాటిపోతున్నామార్కుల లిస్టు చేరక, తూర్పుకి తిరిగి దణ్ణం పెడుతున్న వాళ్ళెంతమందో! డబ్బున్న మహారాజులు డబ్బు వెదజల్లి, పట్టుకోవలసిన వాళ్ళను పట్టుకుని, ఆకాశాన్నీ భూమిని తలక్రిందులు చేసి మార్కుల లిస్ట్ సంపాదించారు. ఏ దారీ లేని అభాగ్యులు...” తన ఫ్రెండ్ రజిత అంటున్నది ఇంక వినలేకపోయింది సుచరిత.

“సుచీ! అనవసరంగా మనసు పాడు చేసుకుని మథన పడినందువల్ల లాభమేమీ లేదు. నీలక్ష్యం మెడిసిన్‌లో సీటు తెచ్చుకోవడం కదా. పరీక్షకు వెళ్లడానికి కావలిసిన మినిమమ్ మార్కులొచ్చాయి నీకు. యింక యీ విషయాన్ని మరిచి పోయి ఎంట్రెన్స్‌పరీక్షకు బాగా చదువు.” హితవు బోధించింది మరో ఫ్రెండ్ హైమ.

మరిచిపోవడం కన్నా చెయ్యగలింగిందేమీ లేదని బాగా అనుభవంలోకి వచ్చింది సుచరితకు. ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ ఒకవైపు మనసు మండిపోతున్నా తలవంచి రాజీపడడడం కన్నా చేయగలిగిందేమీ లేదనే గ్రహింపు వచ్చిందామెకు.

మళ్లీ చదువు మొదలుపెట్టింది సుచరిత. ఈసారైనా తనకు న్యాయం జరిగి తన లక్ష్యాన్ని సాధించగలనన్న ఆశ, సాధించాలన్న పట్టుదల ఒకవైపు... ఈకొద్ది రోజుల్లో యింద్రజాలమేదన్నా జరిగి పరిస్థితులు మారిపోతాయా... ఎందుకు మళ్ళీమళ్ళీ ఆశలు పేర్చుకోవడం, ఎందుకు మళ్ళీమళ్ళీ భంగపడడం అన్న నిరాశ ఒకవైపు... కొద్ది రోజులు గడిచేసరికి అన్నిటినీ మరచిపోయి తన సర్వశక్తుల్నీ తన లక్ష్యసాధన మీద కేంద్రీకరించింది సుచరిత.

ఎంట్రెన్స్ పరీక్షలు సంతృప్తిగా రాసిన సుచరిత రిజల్ట్ కోసం ఆతృతగా

ఎదురు చూస్తోంది. అంతలో ఆశ... అంతలోనే నిస్పృహ... అంతలోనే ఆత్మవిశ్వాసం... అంతలోనే బేలతనం... ఎప్పటికప్పుడు వాయిదా పడి చిట్టచివరికి రిజల్ట్స్ వచ్చాయి.

సుచరిత బంగారు కలలు కాలిపోయాయి. ఆశాదీపాలు ఆరిపోయాయి. కోరికల కెరటాలు తీరాన్ని చేరకుండానే విరిగిపడిపోయాయి. ఒక్కమార్కు తక్కువతో తను ఎక్కవలసిన రైలుని ఎక్కలేకపోయింది సుచరిత.

తనకన్నా తక్కువ మార్కులు వచ్చిన వారికి, రిజర్వేషన్లలో సీటు వచ్చింది. తనకన్నా ఎంతో తక్కువ శ్రమించిన వారికీ... తక్కువ మార్కులు వచ్చినవారికి... సీట్ రావడంతో నిబ్బరించుకోవడం మరీ కష్టమయింది సుచరితకు. మొట్టమొదటి సారి తను అగ్రకులంలో పుట్టినందుకు బాధపడింది.... శతాబ్దాలుగా సాంఘికంగా, ఆర్థికంగా, మరెన్నోవిధాల అన్యాయాలకు గురవుతున్న వారికి చెల్లిస్తున్న యీ స్వల్పమైన నష్టపరిహారాన్ని చూచి తనలాంటి వారు అసూయ చెందటం తగునా అని తర్కించుకుంది అంతలోనే.

"ఎందుకు తగదు? సుబ్బరంగా తగుతుంది. ఇప్పుడు మనకు జరుగుతున్న అన్యాయాలకు ఎవరు ఏవిధమైన పరిహారాన్ని చెల్లిస్తున్నారు. మెరిట్ ప్రకారం యివ్వాల్సిన సీట్స్‌ని యీ రిజర్వేషన్స్ లేకుండా మెరిట్‌ననుసరించే యిస్తే నీకు సీటొచ్చేది కాదా? యిలా రాకపోవడం అన్యాయంగా కాదా?" సుచరిత తర్కాన్ని కొట్టిపారేసింది, ఆమె ఫ్రెండ్ వాణి.

"కులమత వివక్షతల్ని పాటించగూడదని చెప్పూనే ప్రతి విషయంలో ఈ రిజర్వేషన్లేమిటి? వాళ్లకి నువ్వన్న నష్టపరిహారం లాంటిదేదో స్కాలర్ షిప్స్, ఉచిత భోజనసౌకర్యాలు, పుస్తకాల ద్వారా ముట్టుతోనే వుందిగా? మెరిట్‌కివ్వాల్సిన సీటుని నానా రిజర్వేషన్స్‌కి పంపకం చెయ్యడం వల్లే విద్యాస్థాయి యింతగా పడిపోయి సరుకులేని డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులు తయారయి దేశం పరువు తీస్తున్నారు" ఆగ్రహం చూపించింది వాణి.

ఈవాదనలవల్ల ప్రయోజనం లేదని సుచరితకు తెలుసు. అన్నిటికంటే భయంకరంగా ఆమె ముందు నిలుస్తున్న సమస్య- భవిష్యత్తు. ఏం చెయ్యాలి? ఏం చదవాలి? ఎలా చదవాలి? మెడిసిన్‌లో సీట్ వస్తే ఆ ఉత్సాహం... ఉత్తేజం వేరు. వున్న వూళ్ళోనే మెడికల్ కాలేజీ వుంది కాబట్టి పెద్ద ఖర్చు లేకుండానే ఎలాగోలా చదువు లాగించేసేది. కానీ... యిప్పుడేమిటి కర్తవ్యం? ఇకమీదట ఈ

మాత్రం కూడా తనవల్ల కాదని చేతులెత్తేశాడు తండ్రి. తల్లి సాధింపు భరింపశక్యం కాకుండా వుంది. ఎలా వీటన్నింటినీ ఎదురీదడం?

సుచరిత సమస్యల వెల్లువలో కొట్టుకుపోతూ వుండగా వాణి హడావుడిగా వచ్చింది.

"సుచీ! అలా ఎటైనా వెళ్దాం రావే.." వస్తూనే తొందర చేసింది.

పార్కులో పచ్చికమీద కూర్చున్నాక వాణి ముఖం వంక పరిశీలనగా చూచింది సుచరిత. ఉద్రేకాన్ని బలవంతాన అణచుకుంటుంది వాణి.

"ఏమయింది వాణీ?..." ఆప్యాయంగా వాణి చేతినందుకుని అడిగింది సుచరిత.

"ఈ పెద్దవాళ్ళకసలు బుద్ధిలేదే.. ఎంతసేపూ వాళ్ళ చాదస్తం, మూర్ఖత్వం, డబ్బు యావ వాళ్ళవే గాని మనం చెప్పేది వినిపించుకోరు. వాళ్లు చెప్పేదే రైటనే అహంకారం తప్పితే మన పక్షాన ఆలోచించే సహనం లేదు. అసలు మన జీవితాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునే అధికారమెక్కడిది వీళ్ళకు." వాణి ఆవేశానికి తెల్లబోయింది సుచరిత.

"ఏం జరిగిందే ఇంత హాట్ హాట్‌గా వున్నావు?" నవ్వుతో తేల్చేయబోయింది సుచరిత.

"ఎంత సేపూ డబ్బు! డబ్బు!! వెధవ డబ్బు కోసం మా బావను పెళ్ళి చేసుకోమని ప్రాణం తినేస్తున్నారు మావాళ్ళు" సుచరిత మౌనంగా వింటూంది. వెధవడబ్బు అని ఛీత్కరిస్తూంది వాణి. యీ వెధవడబ్బే కనీస అవసరాలకు సరిపడా లేకపోతే ఎంత నరకమో పాపం వాణికి తెలియదు అనుకుంటూంది.

"మా బావకిది రెండో పెళ్ళి. అతని భార్యపోయి ఐదారేళ్ళయింది. అప్పటి నుండి కొడుకును వచ్చే భార్య సరిగ్గా చూస్తుందో, చూడదోనన్న భయంతో పెళ్ళి చేసుకోనని భీష్మించుకు కూర్చున్నాడు. అతనికే బుద్ధి పుట్టిందో, అందరిపోరూ పడలేకే ఒప్పుకున్నాడో గాని మళ్ళీ పెళ్ళి ప్రయత్నంలో ఉన్నాడిప్పుడు. అతని బిజినెస్ బాగా వృద్ధి అవడంతో మావాళ్ళకు నన్ను అతనికి కట్టబెట్టాలని ఆశపుట్టి నన్ను వేపుకు తింటున్నారు." సుచరితకు వాణి సమస్య స్పష్టంగా అర్థం కాలేదు.

"రెండో పెళ్ళి అనా నీకు ఇష్టం లేదు."

"కాదు"

"మంచివాడేనా?"

"చాలా మంచివాడు. తను రెండో పెళ్ళి వాడైనా కట్నంతో సహా కన్నెపిల్ల కావాలని కోరుకునే రోజుల్లో ఏ వితంతువునో, వయసు ముదిరినా పెళ్ళి చేసుకునే అవకాశం లేకపోయిన అమ్మాయినో పెళ్ళి చేసుకోవాలనుకునేంత మంచివాడు. కానీ, వితంతువును చేసుకుంటే వాళ్ళ అమ్మ వురేసుకు ఛస్తానని బెదిరిస్తూంది. అతనికి తెలియకుండా మిగతా అందరూ కలిసి నన్ను వరించారు" క్రమేపీ ఆవేశం తగ్గి సౌమ్యంగా మారింది వాణి స్వరం.

"మరేమిటి నీ అభ్యంతరం?"

"మా బావలాంటి మంచి మగాడి వల్ల ఎవరో ఒక దురదృష్టవంతురాలి బ్రతుకు బాగుపడుతుంటే అన్ని కనీస అవకాశాలున్న నేను అడ్డుపడడం మంచిదంటావా?" వింత కాంతితో మెరుస్తున్నాయి వాణి కళ్లు. విస్మయంతో మరో కొత్త వాణిని చూస్తూంది సుచరిత.

"బావలాంటి వాడిని పెళ్ళాడడానికి అభ్యంతరమా? అతని విషయంలో రెండో పెళ్ళీ, కొడుకువుండడం చాలా చాలా అల్పమైన అంశాలు. ఎవరైనా మరో ఆలోచన లేకుండా అతన్ని పెళ్లాడేయొచ్చు." ఇంతగా అతని గుణగణ కీర్తన చేస్తున్న వాణి అతన్ని పెళ్ళాడననడం నిజమైన హృదయ వైశాల్యంతోనా లేక త్యాగం చేస్తున్నానన్న గొప్ప కోసమా అన్న సందేహం మెదిలిందో క్షణం సుచరితలో... అంతలోనే తనను తాను మందలించుకుంది. తన సంకుచిత దృష్టికి సిగ్గుపడింది.

"ఏంచేస్తావు మరి?"

"అందరూ కలిసి ఏకుమ్మడిన హఠాత్తుగా దాడిచేస్తే, ఏమీ తోచకే నీదగ్గరకు పరుగెత్తుకొచ్చింది. చెప్పు. నీ అభిప్రాయమేమిటి?"

"బావుంది నాకేం తెలుసే" నసిగింది సుచరిత. రెక్కలల్లార్చుతూ పైకెగురుతున్న చిలుకల్ని చూస్తూ ఆలోచిస్తూంది వాణి.

***

"సుచీ! ఏమిటమ్మా ఎందుకింత తొందరపడుతున్నావు పెళ్ళికి"

మృదువుగా అడిగాడు శంకరం. ముగ్గురూ తనవంక బాణాలెక్కుపెట్టినట్లు చూడడం కంపరంగా వుంది సుచరితకు. జవాబివ్వకుండా కోపాన్ని నిగ్రహించుకోవడానికి ప్రయత్నిస్తూంది.

"మాట్లాడవేమమ్మా? రహస్యమా?" రెట్టించాడు శంకరం.

"రహస్యమేముంది మామయ్యా?!" ఇబ్బందిగా మేనమామ వంక చూచింది సుచరిత.

"నీకు రహస్యమెందుకే? నువ్వు బరితెగించావు" ఖస్సున లేచింది శాంత.

"శాంతా! నువ్వూరుకో" గదిమాడు మూర్తి

"ఏమిటమ్మా చెప్పు" అనునయంగా సుచరితను అడిగాడు శంకరం.

"తప్పో.. ఒప్పో... నా స్వంత పూచీ మీద నాబ్రతుకునో కొత్తదారికి మళ్ళిస్తున్నాను. అంతా విని సన్నర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి"

"కథల్లోలా ఉపోద్ఘాతాలకేంలోటు లేదు." అందుకుంది శాంత.

"శాంతా..." గదిమాడు మూర్తి.

"రెండో పెళ్ళివాడిని... బిడ్డ తండ్రిని... అందంలేని వాడిని... పెళ్ళి చేసుకుంటానంటున్నానని అమ్మకు నామీద కోపం. యింకా ఏ అందాల రాకుమారుడో వచ్చి నా అందాన్ని చూచి మోహించి పెళ్ళాడతాడని అమ్మ భ్రమ. చిత్రంగా నేను కనాల్సిన అందమైన కలల్ని అమ్మ కంటూంది. తనెంత అసంభవమైన ఊహల్లో వుందో అమ్మ గుర్తించడం లేదు" అంత వరకు మొండిగా వున్న సుచరిత ముఖం జీవం లేనట్లుగా అయింది.

"మామయ్యా! నాకు మాత్రం ఈడూజోడూ అయిన కుర్రాడ్ని పెళ్ళి చేసుకుని హాయిగా ఆనందంగా వుండాలని ఉండదా?"

"నువ్వు మరీ విపరీతంగా ఊహించుకుంటున్నావేమోననిపిస్తూంది." మధ్యలో అడ్డు తగిలాడు శంకరం. ఈ కాలపు ఆడపిల్లల ఆలోచనలు... ఆశలు... ఊహలు... అంటే కొంత అసహనం శంకరానికి.

"నిజం చెప్పండి మామయ్యా! యిప్పటి పరిస్థితిలో మామూలుగా నా పెళ్ళిఅయ్యే అవకాశముందనే అనిపిస్తూందా మీకు.. నిజానికి... నా తక్షణ సమస్య నా పెళ్ళికాదు. నా చదువు"

గతుక్కుమన్నాడు శంకరం. సుచరితకు చదువు మీద వున్న కోరిక యీ వివాహానికి దారి తీస్తూందా?

"అయినా వయసులో నీకంటే బాగా పెద్ద వాడిని..." మధ్యలోనే తుంచేసింది. సుచరిత.

"ఐతే ఏం? నా కోరికను విని నన్ను నన్నుగా స్వీకరించే సహృదయత, తన కవసరం లేకపోయినా నేను పెట్టిన షరతులన్నిటినీ నిస్సంకోచంగా ఒప్పుకొనే ఔదార్యం ఉన్నాయి. అసలు... అతని అర్హతల్ని ఎంచే ముందు నా అర్హతలేమిటని తర్కించుకుంటే యింత యిబ్బంది వుండదు."

సుచరిత తన అంచనాని మించి ఎదిగినట్లు గమనించాడు శంకరం. ఆమెను తను ఒప్పించలేనని కూడా గుర్తించాడు.

"ఐతే, నువ్వు సంతోషంగానే యీ పెళ్ళికి సిద్ధపడ్డావన్న మాట" అన్నాడు. చెల్లెలి చూపుల్ని తప్పించుకుంటూ.

"సంతోషాన్ని పట్టలేకపోతున్నాను. చదువు అనేది ఒక అందమైన కలగానే మిగిలిపోతుందేమోనన్న నిస్పృహలో వున్నప్పుడీ అవకాశం దొరికింది. నా రెండోకల - ప్రేమగా చూచుకునే భర్త - ముచ్చటైన సంసార జీవితం... అనుకోకుండా నా రెండు కలలూ నిజమవుతుంటే సంతోషంతో నా గుండె పగిలిపోతూంది మామయ్యా" అంత వరకు అన్నగారు కూతురిని ఒప్పించి పెళ్ళిని ఆపు చేస్తాడని ఆశ పెట్టుకున్న శాంత కోపంగా లేచి వెళ్ళిపోయింది.

కూతుర్ని అర్థం చేసుకుని ఆమోదించడానికి ప్రయత్నిస్తున్నాడు మూర్తి.

"బ్రతుకులో కొన్నిటిని పొందాలంటే కొన్ని విషయాల్ని సరిపెట్టుకోవాలి కదూ... మాట్టాడరేం మామయ్యా! మౌనంగా ఆశీర్వదిస్తున్నారా నన్ను" చిరునవ్వు నవ్వింది సుచరిత.

భవిష్యత్తు మీద ఆశతో, తన కోరిక ఫలిస్తుందన్న విశ్వాసంతో తళతళలాడుతున్నాయి ఆమె కళ్ళు.

*ప్రభవ, 1981.*